శ్రీవారి సేవలో మహేష్ బాబు కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారిని సూపర్ స్టార్ మహేష్ బాబు ఫ్యామిలీ దర్శించుకున్నారు. మహేష్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్, కుమారుడు గౌతమ్, కూతురు సితార గురువారం ఉదయం స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారికి రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలతోపాలు స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. బుధవారం అలిపిరి నడకమార్గాన వీరు తిరుమలకు చేరుకున్నారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

నవ్యాంధ్ర ప్రజల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది : మంత్రి సత్యకుమార్ యాదవ్

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో భాగంగా గురువారం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం జిల్లాలోని వివిధ శాఖలు సాధించిన ప్రగతిని వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యవిద్యాశాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ ప్రజాలనుద్దేశించి ప్రసంగించారు. నవ్యాంధ్ర అభివృద్ధికి కోట్లమంది తెలుగు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూన్ 12న ప్రమాణస్వీకారం చేసి ఎన్నికల మ్యానిఫెస్టోలో తెలిపిన విధంగా 16,347 టీచర్ పోస్టులకు మెగా డిఎస్‌సి దస్త్రంపై తొలిసంతకం చేశారన్నారు. ఇందులో చిత్తూరు జిల్లాకు 1,470 పోస్టులు కేటాయించారన్నారు. ఏపి భూయాజమాన్య హక్కు చట్టం రద్దుపై రెండవ సంతకం, ఫించన్ల నగదు పెంపుపై మూడవ సంతకం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణనలపై తరువాతి సంతకాలు చేశారన్నారు. పేదల సేవలో ప్రతి నెలా ఒకటవ తేదీన ఎన్‌టిఆర్ భరోసా పథకం ద్వారా 2024 ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు 2,71,442 మందికి 418.13 కోట్ల రూపాయలు అందించామని, జిల్లాలో 32 మండలాలలో 44 చంద్రన్న సంచార రథంతో ఇంటింటికీ వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. నిరుపేదలకు 5 రూపాయలకే భోజనం, అల్పాహారం మూడు పూటలా కడుపు నిండా భోజనం చేసేందుకు అన్న క్యాంటీన్‌లను కుప్పం, పలమనేరు, పుంగనూరు పట్టణాలలో ఈ నెల 16 నుండి ప్రారంభించన్నుట్లు తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా జిల్లాలోని 2,444 పాఠశాలల్లో ఉన్న 1,63,704 మంది పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజన పథకం అందిస్తున్నామని, భూ ఆక్రమణలు, 22ఏ భూముల తారుమారుకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ వీటి పరిష్కారం నిమిత్తం సెప్టెంబర్ మొదటి వారం నుండి గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతు సంక్షేమంలో భాగంగా పిఎం కిసాన్ కింద 1,75,051 రైతు కుటుంబాలకు రూ.35 కోట్ల రూపాయలు జమచేసామని, ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఆధునిక సాగునీటి పద్ధతుల ఏర్పాటుకు పెద్ద ఎత్తున సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. 2024- 25 సంవత్సరానికి గాను జిల్లాలో గోకులం పథకం ద్వారా 70 నుంచి 90 శాతం సబ్సిడీపై పశువులకు, మేకలకు, గొర్రెలకు, కోళ్లకు గోకులం షెడ్లు ఉపాధి హామీ పథకం కింద నిర్మించుటకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 1,871 ఎస్‌హెచ్‌జిలకు 142 కోట్ల రూపాయలు బ్యాంక్ లింకేజి రుణాలు, స్త్రీనిధి కింద ఈ ఏడాది ఇప్పటి వరకు 7,569 సంఘాలకు 51 కోట్లు రుణ సౌకర్యం కల్పించామన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంకు గాను ఇప్పటి వరకు 97,745 వేల కుటుంబాలకు 33.02 లక్షల పనిదినాలు కల్పించి 125.25 కోట్ల రూపాయలు ఖర్చు చేసామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా 2024 ఏప్రిల్ నుండి జూలై వరకు 567 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని, జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా 97 కిలోమీటర్ల మేర బెంగళూరు -చెన్నై ఎక్స్ప్రెస్ నిర్మాణం, 75 కిలోమీటర్ల మేర చిత్తూరు- తచ్చురు ఆరు లైన్ల రహదారి నిర్మాణం 2024 చివరి నాటికి పూర్తి చేస్తామన్నారు.

చిత్తూరులో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎంపి

మొదటి బహుమతి పొందిన వ్యవసాయ శాఖ శకటం, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ శకటాలు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, జెడ్పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్‌పి మణికంఠ చందోలు, చిత్తూరు నగర మేయర్ అముద, చిత్తూరు, పూతలపట్టు, జీడీ నెల్లూరు శాసన సభ్యులు గురజాల జగన్మోహన్, కె.మురళీ మోహన్, డాక్టర్ థామస్ పాల్గొన్నారు. మొదటగా మంత్రి సత్య కుమార్ యాదవ్‌కి జిల్లా కలెక్టర్, ఎస్‌పి, ఎంపి, జెడ్‌పి ఛైర్మన్, ఎమ్మెల్యేలు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన మంత్రి జిల్లా కలెక్టర్, ఎస్‌పితో కలిసి పోలీస్ పెరేడ్‌ను తనిఖీ చేశారు. జిల్లాలో ప్రజల సేవార్ధం ఉపయోగించే వాహనాలు, శకటాల ప్రదర్శన, విద్యార్థులచే సాంస్కృతిక నృత్యాల ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య సమర యోధులు పిసి రాజన్ ఘనంగా సన్మానించారు. విధులలో ఉత్తమమైన ప్రతిభ కనపరచిన 229 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాల బహూకరణ, వివిధ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి కలెక్టర్ ఎస్‌పితో కలిసి పరిశీలించారు. ఇతర అతిథులు లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ చేశారు. చివరగా జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ఘనంగా ముగిసింది. శకటాల ప్రదర్శనలో వ్యవసాయ శాఖ మొదటి విజేతగా నిలువగా, వైద్యఆరోగ్యశాఖ, విద్యాశాఖలు రెండు, మూడవ బహుమతులను కైవసం చేసుకున్నాయి. వీరికి బహుమతులు, మొమెంటోలు అందజేశారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆవిష్కరించి పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. చిత్తూరునగరంలోని గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ జెండా ఎగరవేశారు. నగరపాలక కార్యాలయంలో నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు జెండా వందన సమర్పించారు. స్థానిక జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముఖ్య కార్యాలయం ఎదుట జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి మనోహర్ గౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రిన్సిపల్ బి.శరత్ చంద్రశేఖర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కొండారెడ్డిపల్లిలోని సర్‌సిఆర్‌ఆర్ పాఠశాలలో కరస్పాండెంట్ మమతా నాథ్, సంతపేటలోని బృందావన్ స్కూల్లో కరస్పాండెంట్ శైలజ కుమారి, చైర్మన్ విజయ భాస్కరరావు, పాఠశాల డైరెక్టర్ ప్రియ తేజ జాతీయ జెండాను ఎగరవేశారు.

కుప్పంలో..

కార్వేటినగరం: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లతా బాలాజీ జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ మనోజ్ కుమార్, పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ ధనంజయ వర్మ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ రెడ్డి, ప్రభుత్వ డైట్ కళాశాలలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, అటవీశాఖ అధికారి వెంకట సుబ్బయ్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కోటేశ్వరరావు, డియంపురం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కేశవులు, వృద్ధాశ్రమంలో ఏఎస్‌ఐ మునికృష్ణ, సిహెచ్‌లో డాక్టర్ భాగ్యలక్ష్మి, ఏఈ గిరీష్, మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భగవతి, ముక్కరవానిపల్లె పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గుణవతి లోకనాథం నాయుడు, శ్రీ లక్ష్మనరసింహ కళాశాల ప్రిన్సిపాల్ డిలీప్ కుమార్, ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు.

ఎస్ ఆర్ పురం: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సరిత, సర్పంచ్ హరిత, ఎంపీడీవో మోహన్ మురళి, ఎమ్మార్వో అమర్నాథ్ ఆధ్వర్యంలో త్రివర్ణ జెండాను ఎగరవేశారు. కొత్తపల్లిమిట్ట ఎస్‌ఆర్ పురం, 13 గ్రామ సచివాలయం, ఎమ్మార్వో కార్యాలయం, సింగల్ విండో కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఏపీఎం కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాలను ఎగురవేశారు. కుప్పయ్య, జనార్ధన్, రామకృష్ణ, హరిరెడ్డి పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వైస్ ఎంపిపి ధనంజయ్ రెడ్డి, సదుం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్ప కుమారి, తహసీల్దార్ మారూఫ్ హుస్సేన్, ఎస్ఐ షేక్ షావల్లి, చెరుకువారిపల్లి పిహెచ్‌సిలో డాక్టర్ చరణ్, జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.జయ కుమార్ రెడ్డి, వినాయక విద్యాసంస్థల చైర్మన్ వి.వెంకటరమణారెడ్డి, వెలుగు కార్యాలయంలో ఏపీఎం హరిప్రసాద్ జాతీయ జెండాలను ఎగురవేశారు.

వి కోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీ యువరాజ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. నారాయణ విద్యాసంస్థలు బిజిఎం కొండలరావు, ఏజీఎం రవీంద్ర ఫణికుమార్ పాఠశాల ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేసి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ లక్ష్మమ్మ సీఎన్.నాగరాజు జాతీయ జెండా ఎగురవేసి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల పాదాలను కడిగి ఘనంగా సన్మానించారు.

వికోటలో..

విజయపురం: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కిరణ్, వైస్‌ఎంపీపీ బాలాజీ, ఎస్ఐ జయప్ప జెండా ఎగర వేశారు. అలాగే పన్నూరు సబ్‌స్టేషన్‌లో రైన్‌బో ప్రైవేట్ కళాశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో విద్యార్థులు చేసిన నృత్యం పలువురుని ఆకట్లుకున్నాయి. నగరిలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ మీడియా ఆర్గనైజేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.సలీం నగిరి బ్రాంచ్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పిసిఎన్ జడ్పీ హైస్కూల్ 300 వందల మంది పిల్లలకు ఉచితంగా గుర్తింపు కార్డు అందజేశారు.

వెదురుకుప్పం: మండలంలో పచ్చికాపల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి ఎస్.ముని చంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కె.లోకనాథరెడ్డి జెండాను ఎగురవేశారు. క్లస్టర్ ఇంచార్జి కోనేరు చెంగల్‌రాయ రెడ్డి, నాయకులు బి.జయరామ్ రెడ్డి, రాజశేఖర్ వర్మ, హేమశేఖర్ రెడ్డి, సుభాన్ కాన్, భాస్కర్ రెడ్డి, ధర్మారెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

జిడి నెల్లూరులో..

గంగాధరనెల్లూరు: 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా వీరకనెల్లూరు గ్రామంలోని వీరక్కకోటపై ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జాతీయ జెండా ఎగరవేశారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ చంద్రశేఖర్, పోలీస్ స్టేషన్లో సీఐ లక్ష్మన్న, ఎమ్మర్సీ కేంద్రంలో ఎంఈవో ఆంజనేయులు శెట్టి, గంగాధర నెల్లూరు పీహెచ్‌సీలో డాక్టర్ దుర్గాదేవి, విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ రాజా, ఎట్టేరి భానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో కరస్పాండెంట్ నాగేశ్వరరావు, 100 గొల్లపల్లె జైన్ ఫ్యాక్టరీలో మేనేజర్ షమీర్ శర్మ, పలు ప్రభుత్వ స్కూల్లో విద్యా కమిటీ చైర్మన్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు.

కుప్పంటౌన్: కుప్పం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో పురపాలక సంఘ అధ్యక్షులు డాక్టర్ సుధీర్ ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాసరావు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

యాదమరిలో..

విచ్చేశారు. ముందుగా స్వతంత్ర సమరయోధుల చిత్రపటాలకు కులవాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు.

బైరెడ్డిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ అధ్యక్షతన ఎంపీపీ ఎం.రెడ్డప్ప జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తహశీల్దార్ కార్యాలయం, మాహతి ఫౌండేషన్ కార్యాలయంలో తహశీల్దార్ మాధవరాజు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

శాంతిపురం: పరమహంస యోగానంద విద్యాలయంలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాళ్లబుదుగూరు ఎస్ఐ నరేష్, పాఠశాల ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి జండా వందనం చేశారు.

పూతలపట్టు: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కుమారి జెండా ఎగురవేశారు. ఆయా కార్యాలయాల్లో అధికారులు జెండాను ఎగురవేసి త్రివర్ణ పతాకానికి వందనాలు సమర్పించారు. పాఠశాలల్లోని హెచ్‌ఎంలు జెండాను ఎగురవేసి విద్యార్థులకు చాక్లెట్లను పంచిపెట్టారు.

బంగారుపాళ్యం: గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ అమరావతి సచివాలయాల్లో సర్పంచులు, మండల కార్యాలయాల్లో మండల అధికారులు జెండా ఎగరవేశారు.

గంగవరం: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, ఎమ్మార్వో కార్యాలయం ముందు ఎమ్మార్వో, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు అలాగే మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో జెండా ఎగురవేసి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

యాదమరి మండల ఎంపీడివో కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్ జాతీయ జెండా ఎగువవేసి వందన సమర్పణ చేశారు. తహశీల్దార్ పార్థసారధి, మండల అభివృద్ధి అధికారి శివరాజ్, మండల విద్యాశాఖ అధికారి రుక్మిణి, ప్రసాద్, వ్యవసాయశాఖ అధికారి చరిత, ప్రధానోపాధ్యాయులు గిరిరాజా పాల్గొన్నారు.

పుంగనూరు: పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో కూడా మువ్వన్నెల జెండాను ఎగురవేసి వేడుకలు నిర్వహించారు. బికే ప్రిన్స్ పాఠశాల విద్యార్థులు పొడవైన జెండాను చేత పట్టుకుని ప్రదర్శన చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, ఎమ్మార్సీలో ఎంఈఓ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్యాలయం, కోర్టు ఆవరణంలో న్యాయమూర్తులు, మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. అలాగే బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ పుంగనూరులోని స్వగృహం శ్రీ సునంద నిలయంలో పార్టీ నాయకులతో కలిసి జాతీయ జెండా ఎగురవేసి, స్వాతంత్ర్య సమరయోధులకు పూలమాలలతో నివాళులు అర్పించారు.

పలమనేరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి జాతీయ నాయకుల చిత్రపటాలకు పూజలు చేసి అనంతరం జాతీయ జెండాను ఎగరవేశారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు. అలాగే పలమనేరులోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 78 స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

పెద్దపంజాణి: మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ రెడ్డప్ప ఆధ్వర్యంలో అలాగే స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ప్రసన్నకుమార్ త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పలమనేరులో..

సమస్యల తోరణం

- నేడు మండల సర్వసభ్య సమావేశం
- సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలంటున్న అధికార గణం

ప్రజాశక్తి - సోమల:

మండల కేంద్రమైన సోమలలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు గదిలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 16వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈసమావేశానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు అధికారులు మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సమావేశంలో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మండల కేంద్రమైన సోమల నుండి పెద్ద ఉప్పరపల్లి వరకు ప్రధాన రహదారి గుంతల మయమై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. సమస్యపై పత్రికలలో వార్త రావడం తాత్కాలిక ఉపశమనంగా మట్టితోలి గుంతలను పూడ్చడం తిరిగి వర్షానికి మట్టి కొట్టుకపోయి తిరిగి గోతులు మేమున్నామంటూ రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఈసమావేశంలో దీనిపై చర్చించి పూర్తిస్థాయిలో సోమల నుండి పెద్ద ఉప్పరపల్లి వరకు తారు రోడ్డు వేసే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా మండలంలోని చాలా దళితవాడలో ప్రజలకు స్మశానవాటికలు కరువయ్యాయి. ఎన్నిసార్లు దళితులు స్మశాన వాటికల కోసం అర్జీలు సమర్పించిన అధికారులు వారికి స్థలం చూపించకపోవడం జరుగుతోంది ఈ సమావేశంలోనైనా ఏ ఏ దళిత వాడకు స్మశాన వాటిక లేదు గుర్తించి వారికి స్మశాన వాటికను అందజేయాల్సిన అవసరం ఉంది. అలాగే ఇరికిపెంట పంచాయతీ పాయలగుట్ట గ్రామంలోని 10 కుటుంబాల వారికి వ్యవసాయ యోగ్యమైన భూమిని కేటాయించి స్మశాన వాటికను కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రెవెన్యూ వారు స్పందించి వారి సమస్యను పరిష్కరిస్తారని ఆశిద్దాం.

అడుసు పల్లె గ్రామంలో తాగునీటి బోరుకు విద్యుత్ సరఫరా ఆగిపోయి రెండు నెలలు దాటుతున్న ఇంతవరకు అధికారులు పట్టించుకోకపోవడంతో తాగునీటి బోరు వృధాగా పడి ఉంది. వెంటనే విద్యుత్ కనెక్షన్ అందజేసి ప్రజలకు తాగునీరు అందించాల్సిన అవసరం ఉంది. మండల కేంద్రంలోని వారపు సంతలో వ్యాపారస్తులు సంతకు వచ్చే వినియోగదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి, వాటిని వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టాలి. మండలంలో అనేకచోట్ల చెక్ డ్యాములు శిథిలావస్థకు చేరుకొని వర్షాలు పడి వంకలు సాగితే చెక్ డ్యాముల శిథిలావస్థ వల్ల నీరు వృధాగా పోతుంది. దీనిపై సంబంధితశాఖ వారు స్పందించి చెక్ డాముల మరమ్మతులు లేదా నూతన చెక్ డ్యాముల నిర్మాణాన్ని చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనివల్ల వ్యవసాయానికి సాగునీరు అందించిన అవకాశం ఏర్పడుతుంది. మండలంలోని పలు చెరువులు కుంటలు వంకలు ఆక్రమణకు గురై రూపు రేఖలు మారిపోయి వర్షాలు కురిసినప్పుడు ఆక్రమణల వల్ల కుచించుకుపోయిన చెరువులు వంకలు నీరు సజావుగా పారెందుకు అవకాశం లేకపోతోంది అదేవిధంగా చెరువు కట్టలు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది దీనిపై సంబంధిత శాఖ స్పందించాల్సిన అవసరం ఉంది. నేటి మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించి సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేస్తారని ఆశిద్దాం.

గుంతల మయమైన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

అడుసు పల్లెలో వృధాగా ఉన్న తాగునీటి బోరు

మైదానం.. మాయమైంది..?

- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థినులు
- రికార్డుల విస్తీర్ణం 7ఎకరాల 32 సెంట్లు
- ఉన్నది ఎకరంలోపే...
- అధికారుల పర్యవేక్షణ లోపం
- ఇష్టానుసారంగా కళాశాల స్థలం ఆక్రమణలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం

మండలంలోని పచ్చికాపలం జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల (బాలికల) క్రీడా మైదానం మాయమైంది.. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబరు 222, 222/1, 222/2లో 7 ఎకరాల 32 సెంట్లు క్రీడ మైదానంకు స్థలం కేటాయించారు. ప్రారంభంలో ఇది విద్యార్థులకు ఆడుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉండేది. రానురాను పచ్చికాపల్లం ప్రాంతంలో భూముల విలువ పెరిగాయి. దీంతో కబ్జాదారుల కన్ను కళాశాల క్రీడా మైదానంపై పడింది. విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికంగా ఉండేవారు వారికి నచ్చినట్లు ఆక్రమణలు మొదలుపెట్టారు. ఈ ఆక్రమణలను ఎవరు అడ్డుకోలేదు. దీంతో వారు శాశ్వత నిర్మాణాలను సైతం చేపట్టారు. ప్రస్తుతం ఉన్నత పాఠశాలలో 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని వసతులు ఉన్నప్పటికీ క్రీడీ మైదానం లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. కళాశాల విద్యార్థులు మొదటల్లో క్రీడా మైదానంగా 7ఎకరాల 32 సెంట్లు స్థలం ఉండేది.. ప్రస్తుతం ఎకరంల్లోపే కనిపిస్తోంది... అది కూడా చదునుగా లేదు గుట్టలు గుట్టలుగా ఎక్కడ చూసినా బండరాళ్లతో దర్శనమిస్తుంది. రెవెన్యూ వారు స్పందించి అక్రమాలను తొలగించి విద్యార్థులకు క్రీడా మైదానం చూపించి అక్రమాలను తొలగించాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు

ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలి

- సిద్ధయ్య, కళాశాల ప్రిన్సిపల్

కళాశాల క్రీడా మైదానం చాలా వరకు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమణలో ఉంది. ఉన్న స్థలం కూడా క్రీడలకు అనుకూలంగా లేదు. విద్యార్థులకు ఆటస్థలం కరువైంది. ఆడుకునేటందుకు ఇబ్బంది పడుతున్నారు. రెవెన్యూ వారు స్పందిస్తే ఆక్రమాలు తొలుగుతాయి. విద్యార్థులకు ఆటస్థలం వస్తుంది.

పరిశీలించి న్యాయం చేస్తాం..

- రమేష్ బాబు, తహశీల్దార్ వెదురుకుప్పం

పచ్చికాపలం జిల్లా పరిషత్ జూనియర్ కళాశాల (బాలికల) క్రీడా మైదానం ఆక్రమణలకు గురైనట్లు తెలిసింది. ఈనెల 17వ తేదీన సిబ్బందితో వెళ్లి పరిశీలించి న్యాయం చేస్తాం.

ప్రచారలోపం

ఏ ఇంటిపై ఎగరని జాతీయ జెండా

సోమలలోని ఏ ఇంటి పైన ఎగరని జాతీయ జెండా

ప్రజాశక్తి- సోమల:78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు రోజుల ముందు నుండే ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగురవేయాలని జెండా రెపరెపలాడాలని కోరారు. అయితే ఇందుకు సంబంధించిన సమాచారం ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికారులు విఫలం కావడం వల్ల ఏ ఒక్క ఇంటి మీద జాతీయ జెండా ఎగరకపోవడం గమనార్హం. గత ఏడాది ఉద్యమంలా ప్రచారం నిర్వహించి ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగిరే విధంగా సఫలీకృతమైన అధికారులు ఈ ఏడాది అందుకు విరుద్ధంగా ప్రచార లోపం కారణంతో సమాచారాన్ని ప్రజలకు చేరవేయ లేకపోయారు. కేవలం ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలు కళాశాలల వద్ద మాత్రమే స్వాతంత్ర దినోత్సవ వేడుకల హంగామా కనిపించింది తప్ప ఇతరత్రా ఎక్కడ అలాంటి సందడి కనిపించలేదు.

డిగ్రీ ఫలితాలలో ..

'మధు' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- గంగవరం: 2024 డిగ్రీ ప్రథమ సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో యూనివర్సిటీ స్థాయిలో మధు కళాశాల విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించారని కళాశాల ప్రిన్సిపల్ కే.కృష్ణమూర్తి రెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో బిఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో 88 శాతం, బికాం కంప్యూటర్స్‌లో మౌనిక 95శాతం, రజియా సుల్తానా 93 శాతం, అంజలి 93 శాతం, గిరిజ 92 శాతం కార్తీక్ 88 శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే బి.విఓసి హార్టికల్చర్‌లో స్టెఫీ 95 శాతం, లయ 93 శాతం మార్కులు సాధించారని తెలిపారు. 72 మంది డిస్టింక్షన్లు, 64 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అత్యధిక శాతం సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ సిపి శ్రీవాణి అభినందించారు.

మదర్ థెరిసా విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి- గంగవరం: 2024 ఎస్వీ యూనివర్సిటీ మొదటి సంవత్సరం ఫలితాలలో మదర్ థెరిసా విద్యాసంస్థల్లో బిసిఎ, బిబిఎ, బీకాం చదువుతున్న విద్యార్థులు చందన నిహారిక 9.6, ఆకర్ష 9.45, పూజ 9.45, చందన 9.4, రజిత 9.4, తాజ్ 9.4, తేజశ్రీ 9.4, రాంసాయి 9.3, యశ్వంత్ 9.4 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలస్థాయిలో టాపర్లుగా నిలిచారని అకాడమీ అధికారి రాజేంద్రరెడ్డి తెలియజేశారు. వీరితో పాటు 325 మంది డిస్టింక్షన్, 141 మంది ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ సునీల్ బాబు, చైర్మన్ రవీంద్రబాబు ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

'ప్రభుత్వ ఆసుపత్రి మంజూరు చేయండి'

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేటలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేయాలని పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గ కో కన్వీనర్ కే.ఉమాపతి ఆరోగ్యశాఖ మంత్రి అనగాని సత్య కుమార్ యాదవ్‌ను చిత్తూరులో కలసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. శంకర్రాయలపేట గ్రామం సుమారు రెండు వేల మంది జనాభాతో పంచాయతీగా ఉందని, తమ గ్రామానికి, ప్రభుత్వ ఆసుపత్రి సదుపాయం లేదని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే అటు పలమనేరుకు గానీ పుంగనూరుకు వెళ్లాల్సి వస్తోందని ఎటువైపు చూసినా 20 కిలోమీటర్ల దూరం ఉందని, అత్యవసర సమయాలలో, డెలివరీ కేసులు వెళ్లాలంటే చాలాకష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయాల్సిందిగా ఆరోగ్యశాఖ మంత్రిని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ విజయ్, ప్రభాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాగరాణి కుటుంబానికి రూ.5లక్షలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుమలలో వరాహ స్వామి గెస్ట్ హౌస్1లో పనిచేస్తున్న ఎం. నాగరాణి మహిళా కార్మికురాలు గురువారం డ్యూటీ ముగించుకొని కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనానికి వెళుతున్న సందర్భంలో గుండెపోటుతో మరణించడం బాధాకరమని, ఆమె కుటుంబానికి టీటీడీ ఐదు లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు నేత టి .సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆమె మతికి సిఐటియు తరఫున ప్రగడమైన సంతాపాన్ని తెలియజేశారు. 15 సంవత్సరాల నుండి ఎఫ్ఎంఎస్ కాంట్రాక్ట్ కార్మికురాలుగా విధులు నిర్వహిస్తూ శ్రీవారికి సేవలు చేస్తుందని తెలిపారు. మహిళా కార్మికురాలు చనిపోతే ఆమె శవాన్ని తరలించడానికి టిటిడి అంబులెన్స్ కూడా ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. శ్రీవారినే నమ్ముకుని పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు టీటీడీ ఇచ్చే బహుమానం ఇదేనా అని ప్రశ్నించారు. టిటిడి యాజమాన్యం మానవతా దక్పథంతో ఆమె కుటుంబాన్ని ఆదుకొని, కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలని టి. సుబ్రమణ్యం కోరారు.

లెదర్ పరిశ్రమలో 'వెట్టి'చాకిరీ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజు కార్మికులకు సెలవు ఇవ్వడం పరిపాటి. అయితే ఇందుకు భిన్నంగా వరదయ్యపాళెం మండలం కురుంజలంలో భారత్ పేరుతో లెదర్స్ (షూస్) పరిశ్రమలో సెలవు ఇవ్వకుండా పండగరోజూ కార్మికులతో పనిచేయించుకున్నారు. ఈ విషయమై పరిశ్రమ ఇన్‌ఛార్జిని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ అడగ్గా ప్రత్యేక అనుమతి తీసుకున్నామని, ఈ సెలవును మరో రోజు కార్మికులకు ఇస్తామని వివరణ ఇచ్చారు. అదనపు దినాలు పని చేయించుకున్నపుడు కార్మికులకు ఓటి రూపంలో నగదును పెంచి ఇవ్వాలని, ఉద్యోగులను బెదిరించి పని చేయించుకోవడం ఏంటని దాసరి జనార్ధన్ ప్రశ్నించారు.

ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి



స్వతంత్ర సమరయోధులు సిఆర్ రాజును సన్మానిస్తున్న దృశ్యం

డ్వామా పిడి రాజశేఖర్

పశుసంవర్ధక శాఖ జెడి ప్రభాకర్ రావు

కార్మికశాఖ జిల్లా అధికారి ఓంకార రావు

ప్రశంసాపత్రం అందుకుంటున్న డిపిఓ లక్ష్మి

సోమల: మండలంలోని నెల్లిమంద వీఆర్వో సుబ్రహ్మణ్యం, తమ్మినాయునిపల్లి వీఆర్వో జీవనజ్యోతి, మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామ సేవకులు రామకృష్ణలకు 78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పలమనేరులో ఆర్డిఓ ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా కేంద్రమైన చిత్తూరులో సోమల అసిస్టెంట్ డైరెక్టర్ ప్రాంతీయ వైద్యశాల అధికారి శ్రీనివాసులు నాయుడు ప్రశంస పత్రాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. విధి నిర్వహణలో తమదైన పాత్ర పోషించి ప్రజలకు సేవలు మెరుగైన సేవలు అందజేసినందుకు ప్రశంస పత్రాలు పొందినట్టు తెలిపారు. వీరిని ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు అభినందించారు.

పెద్దపంజాణి: తహశీల్దార్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న ఉత్తమ అధికారులకు పలమనేరు ఆర్డిఓ మనోజ్ కుమార్ రెడ్డి ప్రశంసాపత్రాలు అందించినట్లు స్థానిక తహశీల్దార్ ప్రసన్న కుమార్ తెలిపారు. పెద్దపంజాణి గ్రామరెవెన్యూ అధికారి టి.సుబ్రహ్మణ్యం అప్పనపల్లి వినోద్, వెంకటేష్, ఆర్డిఓ మనోజ్ కుమార్‌రెడ్డి గ్రామ రెవెన్యూ అధికారులకు, అలాగే కంప్యూటర్ ఆపరేటర్ చాంద్ బాషాకు గ్రామ తలారి వెంకట రమణకు ప్రశంస పత్రాలు అందించారు. పెద్దపంజాణి గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా పని చేస్తున్న రోజారమణికి చిత్తూరు కలెక్టర్ ఆమె సేవలను గుర్తించి ప్రశంసాపత్రం అందించారు. ఉత్తమ ప్రశంసా పత్రం అందుకున్న రెవెన్యూ సిబ్బందికి తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



పంచాయతీ అభివృద్ధికి

ఎంపీ నిధులను కేటాయించండి

వాణిజ్య విభాగ అధ్యక్షులు వంశీ చౌదరి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మండల వాణిజ్యవిభాగ అధ్యక్షులు వంశీ చౌదరి గురువారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావును మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఈసందర్భంగా వంశీ మాట్లాడుతూ పంచాయతీకి సంబంధించిన సీసీ రోడ్లకు, వాటర్ ట్యాంక్ నిర్మాణాలకు ఎంపీ నిధులు మంజూరు చేయాలని కోరగా అందుకు ఎంపి సానుకూలంగా స్పందించి త్వరలోనే ఎంపీ నిధుల నుండి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

'రక్తదానం ప్రాణదానంతో సమానం'

ప్రజాశక్తి- పుంగనూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ వారి రక్తాన్ని దానం చేస్తే ఒక ప్రాణం కాపాడిన వారవుతామని మహమ్మదీయ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు ముజాహిద్ అన్నారు. పట్టణంలో 78వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో మొత్తం 110 బ్లడ్ యూనిట్లు సేకరించినట్టు తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మున్నా, కోశాధికారి అల్తాఫ్, ఉపాధ్యక్షుడు నమాజ్, సలహాదారుడు ఇందాద్, అల్తాఫ్, నూరుల్లా, సయ్యద్, వసీం రబ్బన్, రహమతుల్లా పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఈవోపీఆర్డీగా లక్ష్మీపతి

ప్రజాశక్తి- కార్వేటినగరం: జిల్లా ఉత్తమ ఈవోపీఆర్డీగా లక్ష్మీపతి 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. దీంతో పలువురు ఈవోపీఆర్డీ లక్ష్మిపతిని శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ లతబాలాజీ మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించేవారికి ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు. మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న విజయకుమార్ కూడా జిల్లా ఉత్తమ ఎంఈవో అవార్డును అందుకున్నారు. కార్వేటినగరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ, పలు చోరీ కేసులను, యువతి మిస్సింగ్ కేసులను తనదైన శైలిలో చేదించిన కానిస్టేబుల్ రాజ్‌కుమార్ కూడా జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్నారు.

ఈ ఏడాది నవంబర్‌లో గగన్ యాన్ ప్రయోగం...

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

ఇస్రో ఈ ఏడాది నవంబర్‌లో గగన్ యాన్ మొదటి ప్రయోగం జరుపుతుందని ఇస్రో చైర్మన్ సోమనాద్ తెలియజేసారు. గురువారం షార్ లోని స్పేస్ సెంటర్ స్కూల్ గ్రౌండ్స్ లో జరిగిన 78 వ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో ఇస్రో చైర్మన్ సోమనాద్ పాల్గొన్నారు. ముందుగా ఇస్రో చైర్మన్ సోమనాథ్ చేతుల మీదుగా జాతీయజెండాను ఆవిష్కరించారు. అనంతరం సిఐఎస్ఎఫ్ బలగాలు అందించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. గత ఏడాది చంద్రుని పై ఇస్రో అడుగుపెట్టడానికి కారకులైన ప్రతి ఉద్యోగికి సోమనాద్ సెల్యూట్ చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన దేశ భక్తి గీతాలకు చేసిన నత్య ప్రదర్శనలు అందరి దష్టిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలించిన నగరి డీఎస్పీ

ప్రజాశక్తి- విజయపురం: విజయపురం పోలీసు స్టేషన్‌ను నగరి డీఎస్పీ నరసింహామూర్తి గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడంతో ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా 24 గంటలు నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం సిబ్బంది పనితీరు, స్టేషన్ పరిధిలోని స్థితిగతుల గురించి ఎస్ఐ జయప్పను అడిగి తెలుసుకొన్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి ప్రజాసమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదుల్లో జాప్యం చేయకుండా తక్షణమే స్పందిస్తూ, బాధితులకు తగు న్యాయం జరిగేలా పని చేయాలన్నారు. గ్రామస్థాయిలో దొంగతనాలు జరగకుండా పగలు, రాత్రి పెట్రోలింగ్, బీట్లు నిర్వహించాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు, వ్యాపార సముదాయాల నిర్వాహుకులకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేయాలన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం..!

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి - రామకుప్పం: పేదరిక నిర్మూలనమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా పేదకూలీల కోసం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గురువారం మండల పరిధిలోని హరిజన కోట గ్రామం వద్ద ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అమృత సరోవర్ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షుడు మునుస్వామి, మండల పార్టీ అధ్యక్షకార్యదర్శులు ఆనంద్ రెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, చిన్నికృష్ణ, పత్ర నారాయణ, సుబ్రీ, బాలు, విజయ్ రెడ్డి, వెంకట రమణ పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- తవణంపల్లె: మండలంలోని జి.వడ్డిపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను పూతలపట్టు శాసన సభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ గురువారం ప్రారంభించారు. పైమాఘం సుగుణాకర్ రెడ్డి ఆర్థిక సహాయంతో నిర్మించిన నీటిశుద్ధి కేంద్రంను దాత పైమాఘం సుగుణాకర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించారు. అనంతరం వడ్డిపల్లె గ్రామస్తులకు స్వయంగా నీటిని అందించారు. జి.వడ్డిపల్లి గ్రామంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని తన దృష్టికి ప్రజలు తీసుకురావడం జరిగిందని, అందుకే పైమాఘం సుగుణాకర్ రెడ్డి సహకారంతో సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించడం జరిగిందన్నారు.

త్వరలో పరువు నష్టం దావా వేస్తాం: పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో తమపై పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారిపై త్వరలోనే పరువు నష్టం దావా వేస్తానని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. ఇప్పటికే వారికి నోటీసులు పంపామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని తిరుపతిలో జెండా ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ తమపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై త్వరలో కోర్టు ద్వారా పరువు నష్టం దావా వేస్తామని చెప్పారు. తనకు కోర్టు నుండి ఇంకా ఎటువంటి నోటీసులు అందలేదని, అందితే కచ్చితంగా న్యాయపరంగా సమాధానం అందిస్తామని పెద్దిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో అందరికీ తెలుసని తెలిపారు. రెండు నెలల్లో ఆరోగ్య శ్రీ పథకానికి రూ.2,500 కోట్లు ప్రభుత్వం బకాయి పడిందని చెప్పారు. త్వరలోనే ఆరోగ్యశ్రీని చంద్రబాబు నిర్వీర్యం చేస్తారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను పిపిపి పద్ధతిలోకి తీసుకొస్తామని చెప్పారన్నారు. రానున్న రోజుల్లో పేదలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఫీజు చెల్లించి వైద్యసౌకర్యం పొందాల్సి వస్తుందన్నారు.

క్రైం న్యూస్

వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

గుర్తు తెలీని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్ఐ మల్లప్ప తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని కేజీసత్రం గ్రామానికి చెందిన చంగల్ రాయుడు (83) హర్యానా దాబా వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయాలయ్యాయి. దీంతో అతనిని చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు.

కూరగాయల లోడుతో వెళ్తున్న

టెంపో బోల్తా

ప్రజాశక్తి- సోమల: కర్ణాటక రాష్ట్రం చింతామణి నుండి సోమల మీదుగా కల్లూరుకు కూరగాయల లోడుతో వెళుతున్న టెంపో ఎస్.నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లి సమీపంలోని చెరువు కట్టపై మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో సంఘటన చోటు చేసుకోగా ఈ ప్రమాదంలో వాహనంలోని వారికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం.

తిరుపతంటే చాలా ఇష్టం : హీరోయిన్ హెబ్బాపటేల్

ప్రజాశక్తి - తిరుపతి సిటి కుమారి 24 ఎఫ్ , 24 కిస్సెస్ , ఎక్కడికి పోతావు చిన్నవాడా... సినిమాలతో పాటు ఇతర వెబ్ సిరీస్ లలో నటించిన ప్రముఖ హీరోయిన్ హెబ్బా పటేల్ గురువారం తుడారోడ్డు , వాసన్ ఐకేర్ సమీపంలో బర్కాస్ ఫుడ్ రెస్టారెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. బర్కాస్ హెూటల్ అధినేతలు శరత్ కుమార్ , అజయ్ , భరత్ (యూ.ఎస్.ఏ) ల నిర్వహణలో ప్రారంభించిన ఈ హెూటల్ ప్రారంభానికి తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు , టిడిపి నేత మబ్బు దేవ నారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు. హెబ్బా పటేల్ మాట్లాడుతూ తిరుపతంటే తనకు చాలా చాలా ఇష్టమన్నారు. శ్రీవారిని దర్శించుకోవడానికి తన ఫ్యామిలీతో వస్తుంటానని తెలిపారు. కానీ నేడు హీరోయిన్ అయ్యాక.. బర్కాస్ ఓపెనింగ్ వచ్చి అభిమానుల తో సెల్ఫీలు దిగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఈ 33 వ బ్రాంచ్ ను తిరుపతి నగర ప్రజలంతా ఆదరించాలని కోరారు. కుటుంబంతో కలిసి వారి ఇళ్లలో కూర్చుని ఆనందంగా తిన్నట్లు , రుచికరమైన వెజ్ , నాన్ వెజ్ ఐటమ్స్ ను తిని ఆస్వాదించాలని హెబ్బా పటేల్ పిలుపునిచ్చారు.

సిఎంను కలిసిన తిరుమల రాజుయాదవ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో విజయవాడలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, ఐటి మంత్రి నారా లోకేష్‌ను తిరుమల టిడిపి నాయకులు రాజుయాదవ్ కుటుంబసభ్యులతో కలిశారు. రాజుయదవ్ సుదీర్ఘంగా తిరుమలలో టిడిపి నాయకుడుగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా తిరుమలలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దష్టికి తీసుకెళ్లారు. టిడిపి కేడర్ గత ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న సమస్యలు వివరించారు. అన్ని సమస్యలు త్వరలో పరిష్కారం చేస్తానని చెప్పారని రాజుయాదవ్ మీడియాకు తెలిపారు.

అమ్మకానికి డబుల్ డెక్కర్

'వైసిపి' భారం వదిలించుకునేలా తిరుపతి కార్పొరేషన్ తంటాలు సెకండ్ హ్యాండ్ సగం ధరేనా..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గత వైసిపి భారాన్ని వదిలించుకోవాలని తిరుపతి కార్పొరేషన్ యోచన చేస్తోంది. ఎన్నికలకు ముందు అట్టహాసంగా తీసుకొచ్చిన డబుల్ డెక్కర్ బస్సును అమ్మకానికి పెట్టింది.. 'ఎవరికైనా కావాలా' అంటూ టిడిపి కూటమిలో బేరం పెట్టింది.. అప్పట్లో రూ.2కోట్ల 31 లక్షలతో కొనుగోలు చేసిన డబుల్ డెక్కర్ బస్సును, మరి ఎంతకు అమ్మి వదిలించుకుంటారో వేచి చూడాల్సిందే. ఏదిఏమైనా సెకండ్ హ్యాండ్ కావడంతో సగం ధరే పలికే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

గత వైసిపి ప్రభుత్వం హయాంలో అట్టహాసంగా కొనుగోలు చేసిన డబుల్ డెక్కర్ ఎలక్ట్రికల్ బస్సు కార్పొరేషనుకు పెనుభారంగా మారింది. ఈ బస్సును ఏం చేద్దామని కార్పొరేషన్ అధికారులు ఆలోచనలో పడ్డారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అప్పటి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి దక్షిణ భారతదేశంలో ఎక్కడ లేని విధంగా డబల్ డెక్కర్ ఎలక్ట్రికల్ బస్సును తిరుపతి నగరానికి తీసుకొచ్చారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి రెండు కోట్ల 31 లక్షలతో ఈ బస్సును కొనుగోలు చేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఈ బస్సును తీసుకొచ్చి మాస్టర్ రోడ్లపై నడిపించారు. తిరుపతి నగర వాసులకు ఉపయోగపడుతుందని భావించారు. అయితే నగర ప్రజలు డబుల్ డెక్కర్ ఎక్కేందుకు ఇష్టపడలేదు. దీంతో చాలాకాలం ఖాళీ సీట్లతోనే ఈ బస్సు నగర రహదారులపై తిరిగింది. దీంతో ఈ బస్సును ఆర్టీసీ అధికారులకు అప్పజెప్పాలని గత ఏడాది జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. రెండు నెలలు తిరుపతి నగరంలో డబుల్ డెక్కర్ బస్సును ఉచితంగా నడిపారు. అయితే ప్రజలు ఈ బస్సులో ఎక్కడానికి ఆసక్తి చూపలేదు. దీంతో ఈ బస్సు ఆర్టీసీకి అప్పజెప్పేందుకు కార్పొరేషన్ అధికారులు చర్చలు జరిపారు. అయితే ఆర్టీసీ అధికారులు ఈ బస్సును తీసుకోవడానికి కార్పొరేషన్ అధికారులు కొన్ని షరతులు పెట్టారు. దీంతో తాము ఈ బస్సు నిర్వహణ చేయలేమని ఆర్టీసీ అధికారులు తేల్చి చెప్పేశారు. పైగా రవాణా శాఖ అనుమతి కూడా లేదన్నది వాస్తవం. సహజంగా పెద్ద పెద్ద నగరాల్లో డబుల్ డెక్కర్ బస్సు ఓపెన్ టాప్ లో ఉండేది. నగరపాలక సంస్థ కొనుగోలు చేసిన డబుల్ డెక్కర్ బస్సు ఓపెన్ టాప్ లేకుండా పూర్తి టాప్ తో ఉండడంతో ఈ నగరానికి ఇది అనువైనబస్సు కాదని రవాణా అధికారులు అంటున్నారు. నగరంలో ఈ డబుల్ డెక్కర్ బస్సు నడపాలంటే రవాణా శాఖ అధికారుల పర్మిషన్ తప్పనిసరి ఉండాలి. లేదంటే దీన్ని సీజ్ చేసే అవకాశాలు ఉన్నాయి. నూతనంగా కమిషనర్ బాధ్యతలు చేపట్టిన నారప్ప రెడ్డి మౌర్య డబుల్ డెక్కర్ బస్సు గురించి ఆరా తీశారు. కార్పొరేషన్ జనరల్ ఫండ్‌తో కొనుగోలు చేసిన ఈ బస్సు ఎందుకు ఉపయోగం లేకుండా డంపింగ్ యార్డ్ లో ఉంచడంపై ఆమె అధికారుల తీరు పట్ల అసంతప్తి వ్యక్తం చేశారు. ఈ బస్సును ఏం చేద్దామని అధికారులతో చర్చించారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో డబుల్ డెక్కర్ బస్సు కొనుగోలు చేసిన కంపెనీకే అమ్మేద్దామా? లేదా విశాఖ నగరం లో పెద్ద పెద్ద రోడ్లు ఉండడంతో విశాఖ కార్పొరేషన్ లేదా ,విశాఖ టూరిజం అధికారులను సంప్రదించాలని అధికారులు భావిస్తున్నారు. ఏమైతేనేం డబుల్ డెక్కర్ బస్సును అమ్మకానికి పెట్టారు. బస్సును కొనుగోలు చేసిన కంపెనీకే అమ్మడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా కార్పొరేషన్కు డబుల్ డెక్కర్ బస్సు భారంగానే మారింది. అసలే నిధులు లేక కార్పొరేషన్ ఖజానా ఖాళీగా ఉంది. నగరంలో చేసిన అభివద్ధి పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేక సతమవుతున్నారు. ఇలాంటి సమయంలో డబుల్ డెక్కర్ బస్సులు డంపింగ్ యార్డ్ లో ఉంచకుండా అమ్మడమే మేలు అని భావిస్తున్నారు